క్లుప్తంగా

సాయిబాబా నిత్యాన్నదాన పథకానికి విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

కాళ్ల: మండలం సీసలి గ్రామంలో సాయిబాబా ఆలయం నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,000లు అందజేశారు. భీమవరానికి చెందిన బెల్లంకొండ షణ్ముఖ జ్ఞాపకార్థం అల్లుడు, కుమార్తె మన్నే రాజా రమేష్, శైలజ దంపతులె ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్‌పర్సన్ తోరం అనంతలక్ష్మి సత్యవతిదేవికి ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు బాబావారి ప్రత్యేక దర్శనం కల్పించి శేషవస్త్రంతో ఘనంగా సత్కరించారు.

17న ఒంగోలులో టైలర్స్ రాష్ట్ర మహాసభ


రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): ఒంగోలులో ఈనెల 17న నిర్వహించనున్న టైలర్స్ రాష్ట్ర మహాసభకు తరలివెళ్లి జయప్రదం చేయాలని భీమవరం ప్రగతి పట్టణ టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు కె.రామ కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మహాసభకు సంబంధించి జిల్లా టైలర్స్ అసోసియేషన్ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో టైలర్స్ మహాసభకు తరలి వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈఓపీఆర్‌డీగా సుబ్బారావు

ఆకివీడు: మండలంలోని గ్రామ విస్తరణాధికారిగా కె. వెంకట సుబ్బారావు బాధ్యతలు స్వీకరించారు. జగ్గయ్యపేట పంచాయతీ గ్రేడ్–1 అధికారిగా పనిచేస్తూ పదోన్నతి పై ఈఓపీఆర్‌డీగా బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన డీసీసీబీ చైర్మన్ పీవీఎల్.నర్సింహారాజును మర్యాద పూర్వకంగా కలిసినట్లు మంగళవారం సుబ్బారావు చెప్పారు.

అగ్ని అస్త్రంతో కాండం తొలుచు పురుగుల నివారణ

పాలకోడేరు: మండలం గొల్లలకోడేరు గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద మండల ఇన్చార్జ్ రవికుమార్ ఆధ్వర్యంలో రైతులకి వరిలో కాండం తొలుచు పురుగుల నివారణకు అగ్ని అస్త్రం తయారీ వివరించారు. ఎకరానికి అగ్ని అస్త్రం 5 లీటర్లు, 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ అనూష, వీరేంద్ర, ఐసిఆర్ పి వెంకటలక్ష్మి రమాదేవి రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

ఆకివీడు: మండల స్థాయి క్రీడా పోటీల్ని మండలంలోని సిద్ధాపురం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో 13వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంఈఓ ఏ. రవీంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో వాలీబాల్, కోకో, కబడ్డీ, యోగా, అథ్లెటిక్, త్రోబాల్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్‌లలో పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. పోటీల్లో ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అండర్ 14, అండర్–17 రెండు టీములుగా పోటీలు జరుగుతాయని చెప్పారు. పోటీల్లో విజేతలు నియోజకవర్గంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. మండల స్థాయి క్రీడా పోటీల ఎంపిక మండల గేమ్స్ కోఆర్డినేటర్ జీ.మోహన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చంద్రబాబు అరెస్టును ప్రజలు పట్టించుకోవడం లేదు


యడ్ల తాతాజీ

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో చంద్రబాబు అరెస్టును ఎవ్వరూ పెద్దగా పట్టించుకోవడం లేదని ఎవరు తీసుకున్న గోతిలో వారే పడతారని వైఎస్సార్ పార్టీ దెందులూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ యడ్లతాతాజీ అన్నారు. మంగళవారం తాతాజీ విలేకరులతో మాట్లాడుతూ 2014లో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రెండు నెలల్లోనే ఈ స్కామ్‌కు తెరలేపారన్నారు. ప్రజలకు చంద్రబాబు చేసిన మోసాలు, అవినీతి, అక్రమాలు తెలుసుకున్నారు కాబట్టే అతన్ని అరెస్ట్ చేసి జైల్లో పెట్టినా ప్రజలు పెద్దగా స్పందించలేదన్నారు. ఇలాంటి అవినీతి పరుడుని పవన్ కల్యాణ్ వెనకేసుకు రావడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నీతి, న్యాయం, ధర్మం అని చెప్పుకునే పవన్ కల్యాణ్ చంద్రబాబు కోసం రోడ్డుపై పడుకున్న విధానం చూస్తుంటే అవినీతిని ప్రోత్సహిస్తున్నారని అనిపిస్తుందన్నారు. తాను చేసిన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి బాబు అండ్ కో రాజకీయ కక్షగా చిత్రీకరించాలని విశ్వప్రయత్నం చేస్తున్నారన్నారు. టెక్నాలజీ పెరిగిన తరువాత బాబు అండ్ కో ఎన్ని ఫేక్ వార్తలు సృష్టించినా నిజాలు ప్రజలకు తెలుసని వివరించారు.

15 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

ఆకివీడు: ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు మీ ఇంటికే ఆరోగ్య సిబ్బంది వచ్చే విధంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని మండల అభివృద్ధి అధికారిణి కందుల వాణి చెప్పారు. స్థానిక మండల పరిషత్ హాల్‌లో మంగళవారం ఏఎన్ఎంలు, ఆశ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, వర్కర్లు, సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య పరిస్థితుల్ని తెలుసుకోవాలని సూచించారు. ప్రజల యోగక్షేమాల్ని తెలుసుకుని వారికి ఉన్న ఆరోగ్య ఇబ్బందుల్ని ఏఎన్ఎంలు, వలంటీర్లు ప్రభుత్వం అందజేసిన 15 అంశాల్లో పొందుపర చాలని చెప్పారు. ఈ నెల 29వ తేదీ లోపు ఇంటింటి సర్వే పూర్తి చేయాలని ఎంపీడీఓ ఆదేశించారు. ఈ నెల 30వ తేదీన మండలంలోని చినకాపవరం గ్రామ సచివాలయం వద్ద నుంచి ప్రత్యేక క్యాంపులు ప్రారంభమవుతాయన్నారు. పెదకాపవరం పీహెచ్‌సీ వైద్యురాలు మెహరున్నీస్సా బేగం మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి ఇంటిలో ఉన్న జనాభా వివరాలను తెలుసుకుని వారికి ఉన్న ఆరోగ్య ఇబ్బందుల్ని గుర్తించాలన్నారు. గర్భిణులు, బాలింతలు, దివ్యాంగులు, ఇతర వ్యాధిగ్రస్తుల్ని, దీర్ఘవ్యాధిగ్రస్తుల వివరాల్ని సేకరించాలన్నారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ పరిధిలో వైద్యంతో మెరుగుపడే వారికి స్థానికంగానే వైద్యం అందజేస్తారని చెప్పారు. చిన్నపిల్లల ఆర్థో స్పెషలిస్టులు, జనరల్, మహిళలకు సంబంధించిన వైద్యులు, ఇతర స్పెషలిస్టులను ప్రత్యేక క్యాంపుల వద్ద వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేశారన్నారు. క్యాంపుల్లో మరింత మెరుగైన వైద్యం అందజేసేందుకు ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రోగుల్ని తరలిస్తారని వైద్యురాలు మెహరున్నీస్సా చెప్పారు. సెప్టెంబర్ 28వ తేదీ వరకూ ఆయా సచివాలయాల వద్ద ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తారని ఆమె వివరించారు. ప్రతి వ్యక్తీ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ సమావేశంలో ఎంఈఓ ఏ.రవీంద్ర, ఈఓపీఆర్‌డీ సుబ్బారావు, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


జగనన్న ఆరోగ్య సురక్ష వివరాలను తెలుపుతున్న ఎంపీడీఓ కందుల వాణి, డాక్టర్ మెహరున్నీస్సా బేగం

ఆకివీడులో

స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చైర్‌పర్సన్‌జామి హైమావతి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఏఎన్ఎంలు, ఆశ, వలంటీర్లు, అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ ఇచ్చారు.

జగనన్నకు చెబుదాం స్పందనను వినియోగించుకోండి

ఉండి: ఈ నెల 13వ తేదీ బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న మండల స్థాయి జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పీ ప్రశాంతి ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎస్ రామ్ సుందర్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబందిత మండలస్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు.

సూర్యప్రభకు డాక్టరేట్ ప్రదానం



ప్రొఫెసర్ ప్రసాదరెడ్డి చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న సూర్యప్రభ

కాళ్ల: మండలంలోని ప్రాతాళ్లమెరక గ్రామానికి చెందిన విద్యార్థినికి డాక్టరేట్ దక్కింది. గ్రామానికి చెందిన దాకారపు ధర్మారావు, జయభారతి దంపతుల కుమార్తె సూర్యప్రభ ఆంధ్ర యూనివర్సిటీలో అర్థశాస్త్ర విభాగంలో పీహెచ్‌డీ చేస్తుంది. ఈనెల 9వ తేదీన విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రసాదరెడ్డి చేతుల మీదుగా డాక్టరేట్ ను అందుకున్నట్లు మంగళవారం ఆమె తెలిపారు. మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన తాను కష్టపడి చదివి డాక్టరేట్ సాధించటంతో తన కల నెరవేరిందని ఆమె తెలిపారు. ఈసందర్భంగా సూర్యప్రభను తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

వీరవాసరం మండల అభివృద్ధికి కృషి

వీరవాసరం: మండల పురోభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాలదుర్గ నాగమల్లేశ్వరరావు తెలిపారు. వీరవాసరం ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. అభివృద్ధి సంక్షేమం ప్రజలందరికీ సక్రమంగా అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారధ్యంలో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఎంపీపీ వీరవల్లి దుర్గ భవాని ప్రవేశపెట్టిన రహదారులు, అంగన్‌వాడీ, ఇతర అభివృద్ధి పథకాలకు సంబంధించిన తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. మండల స్థాయి అధికారులతో అభివృద్ధి, సంక్షేమంపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.జ్యోతి, గూడూరి ఓంకారం, గెద్దం భారతి, వీరవల్లి శ్రీనివాసరావు, బోను జ్యోష్ణ దేవి, అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, గులిపల్లి విజయలక్ష్మి, యర్రంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


వీరవాసరం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

మంచినీటి సరఫరా మెరుగుదలకు రూ.21 కోట్లు

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీలో కుళాయిల ద్వారా మంచినీటి సరఫరా మెరుగుదల చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.21 కోట్లు మంజూరు చేసింది. దీనికి సంబంధించి జీవో నెంబర్ 68ని ప్రభుత్వం విడుదల చేసింది. ప్రస్తుతం మున్సిపాలిటీలో మొత్తం పైప్‌లైన్స్ వ్యవస్థ ప్రక్షాళనకు రూ.52 కోట్లతో స్పెషల్ డ్రింక్రింగ్ ప్రాజెక్ట్‌ను మంజూరు చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన రిగిన ఈ ప్రాజెక్ట్ పనులు ఓవైపు సాగుతున్నాయి. మొదటి దశలో పట్టణంలోని 1 నుంచి 9వ వార్డుల వరకూ వార్డుల్లో పనులు మొదలు పెట్టారు. స్పెషల్ ప్రాజెక్ట్‌లో భాగంగా కొత్తగా నాలుగు ఓహెచ్ఆర్‌ల నిర్మాణం, ఇప్పుడున్న 40 కిలోమీటర్ల పైప్‌లైన్స్‌కు అదనంగా కొత్తగా దాదాపు మరో 30 కిలోమీటర్లు మేర శివారు ప్రాంతాలు కవర్ అయ్యేలా పైప్‌లైన్‌లు నిర్మిస్తున్నారు. కొత్తగా మంజూరైన రూ.21 కోట్లు నిధులతో మంచినీటి చెరువు సామర్థ్యాన్ని పెంచడం, చెరువు చుట్టూ ఫెన్సింగ్, అలాగే చెరువు వద్ద సుందరీకరణ పనులు చేపట్టాలని మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు చొరవతో మంచినీటి సరఫరా మెరుగుదలకు అదనంగా రూ.21 కోట్లు మంజూరయ్యాయని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ చెప్పారు. పనులు త్వరలో చేపడతామని ఆమె వివరించారు.


నరసాపురం మున్సిపాలిటీ కుళాయి చెరువు

ఉండి ఏఎంసీ చైర్మన్‌గా వెంకటేశ్వర్లు

కాళ్ల: ఉండి ఏఎంసీ చైర్మన్‌గా ఉండి మండలం మహదేవపట్నం గ్రామానికి చెందిన బొక్కా వెంకటేశ్వరరావును నియమిస్తూ జీవో వచ్చినట్లు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహారాజు తెలిపారు. కాళ్ల మండలం పెద అమీరం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఉండి ఏఎంసీ చైర్మన్‌గా నియమింపబడ్డ బొక్కా వెంకటేశ్వర్లు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహారాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీవీఎల్ నరసింహారాజు చేతులు మీదుగా జీవో పత్రాన్ని వెంకటేశ్వర్లకు అందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు పీవీఎల్‌కు నరసింహారాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


పీవీఎల్ చేతులు మీదుగా ఉండి ఏఎంసీ చైర్మన్‌గా జీఓ అందుకుంటున్న బొక్కా వెంకటేశ్వర్లు

పోషణ మాసోత్సవాలను వినియోగించుకోవాలి

పెనుగొండ: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని వెంకట్రామపురం సర్పంచ్ పిల్లి అనంతలక్ష్మి అన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం వెంకట్రామపురం అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. పోషకాహారం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు, చిన్నారుల్లోనూ, బాలింతల్లోనూ, గర్భిణిల్లోనూ రక్త హీనత తగ్గుతుందన్నారు. లబ్ధిదారులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.విజయకుమారి మాట్లాడుతూ 11 నుంచి 16 వరకూ మిషన్ ఇంద్రధనస్సు నిర్వహిస్తున్నట్లు వివరించారు. దీనిలో భాగంగా ప్రతీ ఒక్కరి చిన్నారి వంద శాతం వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాల్సి అవశ్యకత వివరించి టీకాలు వేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీసు జి.భారతీ దేవి, బి.ఎడ్వర్డు జేమ్స్, ఎం.శ్యామ సుందరి, కె.ఆదిలక్ష్మీ, జీవీఎల్ కృష్ణవేణి, జి.విజయ గౌరి పాల్గొన్నారు.


వెంకట్రామపురంలో పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

షాపుల తనిఖీ


జువ్వలపాలెం రోడ్డులో భిక్షాటన చేస్తున్న మహిళలకు కౌన్సెలింగ్ ఇస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: ఆపరేషన్ స్వేచ్ఛ ఫేస్–3 లో భాగంగా భీమవరం పట్టణం జువ్వలపాలెం రోడ్డులో మంగళవారం కార్మిక శాఖ ప్రత్యేక బృందం పర్యటించింది. ఈ సందర్భంగా వివిధ షాపులను పరిశీలించగా బాల కార్మికులు, వెట్టిచాకిరీ చేసేవారు దొరకలేదు. రోడ్డుపై భిక్షాటన చేస్తున్న ఇద్దరు మహిళలు, ఇద్దరు బాలలను గుర్తించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో నరసాపురం అసిస్టెంట్ లేబర్ కమీషనర్ ఎ.లక్ష్మి, భీమవరం రెండో సర్కిల్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కాశీ శివనాగమల్లేశ్వరరావు, టుటౌన్ ఎస్సై పి.అప్పారావు, దిశ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ శేషకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల నియామకం కోసం దరఖాస్తుల ఆహ్వానం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. తెలుగు, మాథ్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, ఎంఎస్సీ ఆక్వాకల్చర్ సబ్జెక్టుల్లో అతిథి అధ్యాపకుల నియామకం కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. సంబంధిత సబ్జెక్టులలో పీజీ ఆక్వాకల్చర్, జువాలజీ, ఎంసీఏ, ఎంటెక్, డిగ్రీలో కనీసం 55 శాతం లేదా పైన మార్కులు కలిగి ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు. అలాగే అదనపు అర్హతలు పీహెచ్‌డీ, నెట్, ఏపీ సెట్‌తో పాటు బోధన అనుభవం కలిగి ఐసీటీ టూల్స్ ద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానం ద్వారా బోధించగలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు ఈ నెల 18లోపు కళాశాల కార్యాలయంలో అందజేయాలన్నారు. దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 21 నుంచి ఉదయం 10 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని పేర్కొన్నారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఎస్సై మోహన్ రావు తన సిబ్బందితో నరసింహపురం గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.5,300 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి

తణుకు టౌన్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను గ్రామాల్లోని పేదలకు అందేలా ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు కృషి చేయాలని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ చెప్పారు. మంగళవారం తణుకు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిగా హాజరయ్యారు. ఈ సమావేశానికి ఎంపీపీ రుద్ర ధనరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ మండలంలోని జగనన్న కాలనీల్లో ఆప్షన్ 3 ఇళ్ల నిర్మాణాన్ని అందరూ బాధ్యతగా గుర్తించి ఏజెన్సీలను గుర్తించాలని కోరారు. ఆప్షన్ 3లో ఇప్పటికే మండలంలో 305 ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. మిగిలిన ఇళ్లను కూడా త్వరగా నిర్మించేలా సభ్యులు కృషి చేయాలని కోరారు. ఈ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారుల కూడా తమ వంతు సహాయ, సహకారాలను అందించాలని కోరారు. జగనన్న కాలనీల్లో ప్రతీ ఇంటికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేందుకు జాతీయ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకంలో రూ. 6 వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు అధికారులు కృషి చేయాలని కోరారు. గృహ నిర్మాణ మండల ప్రత్యేక అధికారి పీ శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ వీ వెంకటరెడ్డి మాట్లాడుతూ మండలంలోని జగనన్న కాలనీలకు అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ. 78 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మాట్లాడుతూ మండలంలోని వేల్పూరు, దువ్వ గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ పనుల కింద 25 కిలో మీటర్ల మేర పైప్‌లైన్‌ల అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. వేల్పూరులో అసంపూర్తిగా మిగిలి పోయిన పైప్‌లైన్ పనులను వెంటనే పూర్తి చేయాలని కోఆప్షన్ సభ్యుడు కె.జస్పాల్ కోరారు. మండపాక గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని ఎంపీటీసీ సభ్యుడు వేల్పూరు శ్రీనివాసు కోరారు.

తూర్పు కాపులను ఓబీసీ జాబితాలో చేర్చేందుకు కృషి

పాలకొల్లు అర్బన్: తూర్పు కాపులను ఓబీసీ జాబితాల్లో చేర్చి వారికి విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పనలో ఓబీసీ రిజర్వేషన్ వర్తించే విధంగా కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల ఇన్‌చార్జ్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి హామీ ఇచ్చారు. రెండు రోజుల క్రితం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గుడాల గోపిని తూర్పుకాపు సంఘీయులు కలిసి ఓబీసీ రిజర్వేషన్‌ల విషయంతో తమకు జరుగుతున్న నష్టాలను వివరించారు. దీంతో గోపి స్పందించి పట్టణానికి చెందిన తూర్పుకాపు సంఘీయులను తన వెంట తీసుకుని మంగళవారం తాడేపల్లిలోని ఎంపీ మిథున్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా కలిసి సమస్య వివరించారు. ప్రస్తుతం రాష్ట్రం నుంచి కేంద్రానికి తూర్పు కాపుల ఓబీసీ రిజర్వేషన్ సమస్య ప్రతిపాదనలు వెళుతున్న నేపథ్యంలో సమస్యపై సానుకూలంగా స్పందించాలని సంఘీయులు కోరారు. ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లో నివసిస్తున్న తూర్పుకాపులకు మాత్రమే ఓబీసీ రిజర్వేషన్ వర్తిస్తుందని సంఘీయులు ఎంపీకి వివరించారు. మిగిలిన 10 జిల్లాల్లో నివసిస్తున్న తూర్పు కాపులకు ఓబీసీ రిజర్వేషన్ వర్తించకపోవడంతో విద్య, ఉద్యోగ రిజర్వేషన్లు కోల్పోతున్నామన్నారు. సామాజికంగా వెనుకబడిపోతున్నామని వారు ఎంపీకి వివరించారు. దీంతో ఎంపీ మిథున్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకువెళతానని హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో వైఎస్సార్ సీపీ చింతలపూడి పార్టీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, తూర్పు కాపు సంఘ నాయకులు శంకరాపు శ్రీనివాస్, యలకల రంగ, ఇజ్జాడ చిన బాబు, జమ్ము ముత్యంజయరావు, అల్లు మురళి తదితరులు పాల్గొన్నారు.


ఎంపీ మిథున్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గుడాల గోపి, తూర్పు కాపు సంఘం నాయకులు

లేసుపార్కులో టైలరింగ్ శిక్షణ



లేసుపార్కులో టైలరింగ్‌లో శిక్షణను ఇస్తున్న దృశ్యం

- మహిళలకు ఆసరా కల్పించడమే లక్ష్యం
- శిక్షణ తీసుకుంటున్న 90 మంది మహిళలు

నరసాపురం రూరల్: కేవలం మహిళా నైపుణ్యం పైనే మనుగడ సాగే లేసు తయారీ వస్తువులకు పూర్వవైభవం తీసుకు వచ్చే దిశగా నరసాపురం లేసు పార్కులో కార్యాచరణ రూపొందుతోంది. లేసు అల్లికలు, లేసులతో తయారయ్యే ఇతర దుస్తులు మరింత నైపుణ్యంతో ప్రపంచ దేశాలన్నింటినీ అబ్బురపరచి, ఆకట్టుకునే విధంగా సిద్ధం చేయడానికి నైపుణ్యాభివృద్ధిని కూడా పెంపొందించే పనిలో లేసుపార్కు కేంద్రంగా మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. దీనిలో భాగంగా విజయవాడకు చెందిన నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ (నాక్) ద్వారా నరసాపురం మండలంలోని రుస్తుంబాద లేస్ పార్కులో లేసు అల్లికలతో పాటు, టైలరింగ్, కంప్యూటర్ శిక్షణను ఇస్తున్నారు. ప్రస్తుతం మూడు బ్యాచ్‌లుగా 90 మంది ఇక్కడ శిక్షణ తీసుకుంటున్నారు. 90 రోజుల పాటు జరిగే ఈ శిక్షణను పూర్తి చేసుకున్నవారికి సెంట్రల్ గవర్నమెంట్ సర్టిఫికెట్‌తో పాటు స్వయం ఉపాధి కోసం రుణాలు, పలు కంపెనీలలో ఉద్యోగావకాశాలను సైతం కల్పించే విధంగా సన్నాహాలు చేశారు. మహిళా నైపుణ్యాన్ని మరింత పెంపొందించి వారి ఆర్థిక ప్రగతిని పెంపొందించడానికి సుదీర్ఘ ప్రణాళికను రూపొందించేందుకు లేసుపార్కు సన్నద్ధమైనది. ప్రపంచ మార్కెట్‌లో నరసాపురం లేసు వస్తువులు తట్టుకుని నిలబడే విధంగా ఇక్కడ లేసు ఉత్పత్తుల తయారీకి కార్యాచరణ సిద్ధమైంది. నరసాపురం ప్రాంతంలో అర్ధ దశాబ్దకాలంగా లేసు తయారీ రంగంలో వచ్చిన మార్పులను అధ్యయనం చేసి రానున్న 50 ఏళ్ల కాలంలో భవిష్యత్ తరాల ఆలోచనలను అభిరుచులను అంచనా వేసి లేసు ఉత్పత్తుల తయారీని రూపొందించే ఆలోచనలు చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే, చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు చొరవ చూపి జిల్లా కలెక్టర్ ప్రశాంతి దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె మరింత శ్రద్ధ కనబరిచారు. డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్, లేసుపార్కు మేనేజర్ తదితరులు నిత్యం శిక్షణా తరగతులను పర్యవేక్షిస్తున్నారు.

శిక్షణ బాగుంది



లేసుపార్కులో ఇస్తున్న టైలరింగ్ శిక్షణకు నెల రోజులుగా వస్తున్నాను. టైలరింగ్‌లో మెలకువలు నేర్పుతున్నారు. కటింగ్, టైలరింగ్, వివిధ రకాల డిజైన్లు తెలిపారు.

– చదలవాడ మౌనిక, ఎన్టీఆర్ కాలనీ, నరసాపురం

నా కల నెరవేరింది



టైలరింగ్ నేర్చుకోవాలనేది నాకు ఎప్పటి నుంచో ఉన్న ఆలోచన.అయితే మాది పల్లెటూరు కావడంతో కుదలేదు. మా ఊరి నుంచి నాతో పాటు మరో ముగ్గురం వస్తున్నాము. మరో బ్యాచ్‌లో లేసు అల్లికల తయారీపై శిక్షణ కూడా తీసుకోవాలనుకుంటున్నారు.

– మట్టా రిబ్కా, చవ్వాకుల మెరక

బాగా ట్రైనింగ్ ఇస్తున్నారు



నెల రోజులుగా జరుగుతున్న టైలరింగ్ శిక్షణ బాగా జరుగుతోంది. బొజేలు, స్కర్ట్, ఫ్యాంట్, షర్ట్‌లు కటింగ్ కూడా చెబుతున్నారు. నా కాళ్లపై నేను నిలబడ గలనన్న నమ్మకం కలుగుతోంది.

– ఆకన కృష్ణవేణి, ఆకనవారి తోట

సీపీఆర్‌తోనే ప్రాణ రక్షణ

తాడేపల్లిగూడెం (టీటీసీ): కార్డియాక్ అరెస్ట్ సమయంలో ప్రాణాలను కాపాడేందుకు సీపీఆర్ ఎంతో ఉపయోగపడుతుందని పలువురు ట్రైనర్స్ విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆత్మబంధువులం సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు సీపీఆర్‌పై శిక్షణ అందజేశారు. చదువులో విజయం సాధించేందుకు ఏమి చేయాలి అనే అంశంపై, జ్ఞాపక శక్తి పెరిగేందుకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వెజ్జు శ్రీనివాస్, సైకాలజిస్ట్ గంగాధర్, గౌరవాధ్యక్షుడు కడియాల పరుశురామయ్య, అధ్యక్షుడు వెజ్జు దుర్గా ప్రసాద్, సెక్రటరీ శీతాల ఉషా కిరణ్, రమాకాంత్, త్రిమూర్తులు పాల్గొన్నారు.